

# హైదరాబాద్ వార్త


## ఆదివాసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఇతరులకు ఉపాధి కలిగించే స్థాయికి ఎదగాలి

**హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**



ప్రసంగిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: ఆదివాసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఇతరులకు ఉపాధి కలిగించే స్థాయికి ఎదగాలని, మూలాలను మరవకూడదని బండారు దత్తాత్రేయ అన్నారు. మూలాలను మరువకూడదని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం చిక్కడపల్లిలో శ్యామ్‌ప్రసాత్ ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ సైన్‌సెస్(ఎస్ఐఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కుమరమ్‌బీమ్ స్టడీసర్కిల్(కెబిఎస్‌సి) గిరిజన విద్యార్థుల స్టడీ సర్కిల్ కుమరమ్‌భీమ్ స్టడీ సర్కిల్ (కెబిఎస్‌సి) ఆవరణలో గిరిజన విద్యార్థులో ముఖాముఖి కార్యక్రమం సిస్ సంస్థ ఫౌండర్ ట్రస్టీ పి.వేణుగోపాలరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్ర మంలో బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ పేసా చట్టం, ఆటవీ హక్కుల చట్టం ఆదివాసీలకు ప్రత్యేక హక్కులను కలి గిస్తున్నాయని, వీటి సంరక్షణకు సహకరిస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్ సంస్థ కార్యదర్శి కొండలరావు, ట్రస్టీ రాజేష్, ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ కె.మధుకర్, రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారి, స్థానిక బిజెపి నేతలు, కెబిఎస్‌సి పూర్వ విద్యార్థులు మేస్రం నాగోరావు, సిడం మధుకర్, రాయ్‌సిడం రాము, మేస్రం పాండురంగ్, ఆర్క భగవంత్, పెందూర్ ధర్మ, తేకం రవి, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు. వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా 1000 మందికిపైగా ఆదివాసీ విద్యార్థులు కెబిఎస్‌సి ద్వారా లబ్దిపొందారని, వారిలో దాదాపు 150 మంది వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు.

## విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలి

**నగర సిపి సి.వి.ఆనంద్**




విజేతలకు అవార్డులు ప్రదానం చేసిన సి.వి.ఆనంద్

సైఫాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని అప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని నగర పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ చెప్పారు. ముఖ్యంగా క్రమ శిక్షణ, దేశభక్తి కలిగియుండటంతోపాటు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను అలవరుచుకోవాలని ఆయన సూచించారు. స్మార్ట్ జీనియస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో 'గ్లోబ్ లెవల్ కాంపిటేషన్-2023' విజేతలకు ఆయన అవార్డులను ప్రదానోత్సవం చేసిన సందర్భంగా మాట్లాడారు. నేటి ప్రపంచీకరణలోని కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరూ అన్ని రంగాలలో పోటి పడక తప్పడం లేదని పోటిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు సన్నద్ధంగా ఉండాలన్నారు. స్మార్ట్ జీనియస్ సంస్థ విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ డా.ఎం.మంజూరుహుస్సేన్, స్మార్ట్ జీనియస్ సంస్థ చైర్మన్ రాజ్యలక్ష్మిరాజ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సుర్రుమంటున్న సూరీడు

**సీజన్‌కు ముందే రికార్డు టెంపరేచర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : నగరంలో ఎండలు మండుతున్నయ్. సీజన్‌కు ముందే సుర్రుమంటున్నయ్. నగరంలో గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈసారి ఇప్పటికే 36 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి.రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొంటున్నారు. రానున్న మూడు రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.సాధారణం కంటే అదనంగా 2.8 డిగ్రీలు నమోదు అయిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ నెలను తలపించే రీతిలో భానుడు ప్రతాపం చూపుతున్నది. దీంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రత ఈ స్థాయిలో ఉంటే మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనలకు గురవు తున్నారు. రానున్న వారం రోజులు ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం పది గంటల నుంచే ఎండ మండుతోంది. ఇల్లు దాటి బయ టకు రావాలంటే జనం భయపడుతున్నారు. మధ్యాహ్నానికి నిప్పులు కక్కుతు న్నారు. పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి.

దీంతో ప్రధాన రహదారులలో ట్రాఫిక్ రద్దీ కొంత తగ్గుముఖం పడుతున్నది. ఎండతో మధ్యాహ్నం 12గంటల నుంచి 3 గంటల సమ యంలో రోడ్లపైకి వచ్చేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్దులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎండల్లో పనులకు వెళ్లే వారు అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ కీచక బుద్ధి

**ఎల్‌కేజీ విద్యార్థికి చాక్లెట్ ఆశచూపి.. లైంగిక దాడికి యత్నం**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. కొమరం భీం జిల్లా రెబ్బెన మండలం తుంగెడం గ్రామానికి చెందిన బామిని మోహన్ (29) పంజాగుట్టలో అద్దెకుంటూ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 22న మధ్యాహ్నం ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీలో నివసించే స్నేహితుడు ప్రసాద్ ఇంటికి వచ్చి మోహన్ పీకలదాకా మద్యం తాగాడు. మద్యం మత్తులో ఉన్న అతను సాయంత్రం అదే ఇంటి కిందిభాగంలో ఉంటున్న ఎల్‌కేజీ చిన్నారికి చాక్లెట్ ఇస్తానని గదిలోకి తీసుకెళ్లాడు. దుస్తులు విప్పేసిన మోహన్ ఆ చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. రోదిస్తూ బయటికి వచ్చిన చిన్నారిని ఏం జరిగిందని తల్లి ప్రశ్నించగా.. జరిగిన విషయం చెప్పింది. దీంతో స్థానికులు నిందితుడు మోహన్‌తో పాటు విందుకు పిలిచిన స్నేహితుడు ప్రసాద్‌ను చితకబాదారు. అక్కడి నుంచి మోహన్ పరారు కాగా చిన్నారి తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## అమ్మకు అక్షర నైవేద్యం పుస్తకం చరిత్రలో నిలుస్తుంది

**హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు అమ్మకు అక్షర నైవేద్యం పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

చార్మినార్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : అమ్మకు అక్షర నైవేద్యం పుస్తకం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు.శ్రీ మహాకాళీ మహేష్ గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు జి.అరవింద్ కుమార్ గౌడ్,ప్రధాన కార్యదర్శి కె.వెంకటేష్‌లు శనివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి శాలువతో సన్మానించి అమ్మకు అక్షర నైవేద్యం పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ లాల్‌దర్వాజ శ్రీ మహాంకాళీ అమ్మవారిని కీర్తిస్తూ దేశ విదేశాలలో ఉన్న జగత్‌గురువులు, పండితులు, కవులు రాసిన 526 కవితలతో కూడిన పుస్తక సంకలనం చరిత్రలో నిలిచి పోతుందని తెలిపారు.ఈ మహాకార్యానికి కారుకుడు స్వర్గీయ గౌని మహేష్ గౌడ్ చిరస్మరణీయుడని దత్తాత్రేయ కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన పలవురు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు

సైఫాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఈ ఏడాది డా.నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చాలని సంకల్పించింది. తెలుగు భాషా, సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, లలిత కళలు, జానపద విజ్ఞానం తదితర అంశాలలో విద్యాత్మక, కళాత్మక లక్ష్యాలతో విశ్వవ్యాప్త వికాసానికై అలనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి డా.ఎన్‌టిఆర్ 1985వ సంవత్సరంలో రాష్ట్ర శాసనసభకు ప్రత్యేక చట్టం ద్వారా డిసెంబరు 6న తెలుగు విశ్వవిద్యాల యంకు అంకు రార్పణ చేశారు. తదనంతరం 1996లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా మారి తెలుగు భాషా, సాహిత్య, చరిత్ర, లలిత కళల విద్యావిషాయక కోర్సులను బోధి స్తూ, పరిశోధన, ప్రచురణ అంశాలను పరిగణంలోకి తీసుకుంటూ, అరుదైన విజ్ఞాన ప్రాంగణంగా బాసిల్లుతూ దేశంలోనే సాంస్కృతిక విశ్వవిద్యాలయంగా తన ప్రత్యేకతను చాటుకుంటుంది. గతంలో సంగీత, నాటక, సాహిత్య, లలిత కళా అకాడమీలను రద్దు పరిచి తెలుగు విశ్వ విద్యాలయంలో విలీనం చేసి తద్వారా ఎందరో ప్రతిభా మూర్తులను కళారంగానికి పరిచయం చేయాలనే సత్ సంక ల్పానికి శ్రీకారం చుట్టిన మహా నటుడు డా. నందమూరి తారకరా మారావు అశయసిద్ధి దిశగా తెలుగు వర్శిటి పయని స్తున్నది. ఈ ఏడాడి ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా వారి పట్ల తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న గౌకవంతో వారి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తలపెట్టినట్లు ఉపాధ్యక్షులు ఆచార్య టి.కిషన్ రావు తెలిపారు. మార్చి 10న తెలుగు వర్సిటి వరంగల్‌లో జానపద గిరిజన అధ్యయన పీఠం, దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ (ఫాజిల్స్) సంయుక్త ఆధ్వర్యంలో 'జానపద గిరిజన అధ్య యనం- సమస్యలు పరిష్కారాలు' అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ గావించుటకు దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు పరిశోధక విద్యార్థులను, అధ్యాపకులను ఆహ్వానిస్తున్నది. ఆదే విధంగా తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాష సాహిత్య ఔన్నత్యం స్థితిగతులు-తెలుగు మాధ్యమాల అవశ్యకత అనే అంశంపై ఉభయ తెలుగు రాష్ట్రాల భాషా వేత్తలతో సదస్సు ఏర్పాటు చేస్తున్నది. హైదరాబాద్‌లోని తెలుగు లలిత కళాక్షేత్రంలోని లలిత కళాపీఠంలో 1985 నుంచి వివిధ కోర్సులలో విద్యను అభ్య సించిన పూర్వ విద్యార్థులతోపాటు ప్రస్తుత విద్యార్థులను కలిపి సాహిత్యం, సంగీతం, నృత్యం, జానపదం, చిత్రలే ఖనం, శిల్పం తదితర అంశాలలో పోటీలను నిర్వహించి విజే తలకు సముచితరీతిన నగదు పురస్కారాలు అందజేస్తామని తెలుగు విశ్వవిద్యాలం ఉపాధ్యక్షులు తెలిపారు. ఎన్‌టిఆర్ శత జయంతిని పురస్కరించుకుని తెలుగు విశ్వవిద్యాలయాన్ని మరింత విస్తరింపజేస్తూ నగర శివారులోని బాచుపల్లిలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అధునాతన భవన సము దాయంలోకి త్వరలోనే మారబోతున్నామని ఆయన చెప్పారు.

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో కుక్కల బెడదను నివారించండి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని,తక్షణమే అధికారులు కుక్కలు బెడద లేకుండ అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.కుక్క కాటు వల్ల కొద్ది రోజుల క్రితం పలువురు చిన్నారులు గాయాల పాలయ్యారని,అధికారులు కుక్కలను పట్టించి ప్రజలను రక్షించాలని వై.శ్రీధర్ కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సత్యనారాయణ ముదిరాజ్,బండారి బాలక్రిష్ణ, సందీప్ పాల్గొన్నారు.

# గుండెకు మహా గండం

- ఒక్కసారిగా కుప్పకూలి చనిపోతున్న వైనం
- పెరుగుతున్న సడన్ కార్డియాక్ అరెస్టులు
- సీపీఆర్‌తో పోయే ప్రాణం తిరిగొచ్చిన వైనం



సీపీఆర్ అంటే.. ఎవరైనా హఠాత్తుగా ఛాతిలో నొప్పి, ఇబ్బందితో కుప్పకూలిపోతో వెంటనే సమీపంలో ఉన్నవారు రెండు చేతులతో ఛాతిపై బలంగా నొక్కాలి. అలా 20-30 సార్లు చేయాలి. తర్వాత రెండు ముక్కు రంధ్రాలు మూసి నోటిలోకి గట్టిగా గాలి ఊదాలి. ఇలా రెండు మూడు సార్లు చేయాలి. దీన్నే సీపీఆర్ అంటారు. ఇలా చేయడంపై శిక్షణ ఇవ్వాలని స్వయంగా మంత్రి హరీష్‌రావు పేర్కొనడం విశేషం. సీపీఆర్ వల్ల గుండెపై ఒత్తిడి పడుతుంది. గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత వెంటనే ఆసుపత్రికి తరలించడం ద్వారా ప్రాణాలు కాపాడే వీలుంటుంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : మొన్నటికి మొన్న నగరంలో రబ్బాని అనే వ్యక్తి పెళ్లి వేడుకల్లో పాల్గొని..వరుడి పాదాలకు పసుపు రాస్తుండగా గుండెపోటుతో క్షణాల వ్యవధిలో ప్రాణాలు విడిచిన విషయం తెలిసిందే. అలాగే బోయిన్‌పల్లిలో జిమ్‌లో వ్యాయామం చేస్తూ 24 ఏళ్ల యువ కానిస్టేబుల్ విశాల్ ఉన్నట్టుండి కుప్పకూలాడు..వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. నందమూరి తారకరత్న కూడా 40 ఏళ్ల వయసులోనే హార్ట్ ఎటాక్‌తో చనిపోయారు.

రోడ్డుపై కుప్పకూలి పడిపోయిన ఓ యువకుడి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజశేఖర్ రక్షించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.శుక్రవారం ఉదయం ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన బాలరాజు అనే వ్యక్తి రాజేంద్రనగర్ సర్కిల్ అరంఘర్ చౌరస్తా వద్ద ఉన్నట్టుండి గుండెపోటుతో కుప్పకూలాడు. దీంతో అక్కడే విధుల్లో ఉన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజశేఖర్ పరుగున అక్కడకు చేరుకున్నాడు. అయితే అప్పటికే యువకుడి గుండె కొట్టుకోవడం ఆగినట్టు గుర్తించిన కానిస్టేబుల్ ఎంతో సమయస్ఫూర్తితో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) చేశారు. కానిస్టేబుల్ అప్రమత్తతతో యువకుడి ప్రాణం నిలిచింది. సిపిఆర్ చేసిన వెంటనే యువకుడు తిరిగి ఊపిరితీసుకున్నారు. కాగా యువకుడు పడిపోయిన వెంటనే ఎంతో సమయస్ఫూర్తితో సిపిఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టిన కానిస్టేబుల్ పట్ల ప్రశంసలు వెల్లువెత్తాయి. 2013బ్యాచ్‌కు చెందిన రాజశేఖర్‌కు గతంలో ట్రాఫిక్ ఇన్‌స్టిట్యూట్‌లో సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. గుండె నొప్పి వచ్చిన వారికి ఎలా సహాయం చేయాలో నేర్పించారు. ఇప్పుడదే శిక్షణ ఆ యువకుడి ప్రాణాలు కాపాడింది.

ఇటీవల కాలంలో అకస్మాత్తుగా గుండె ఆగి (సడన్ కార్డియాక్ అరెస్ట్) చనిపోతున్న సంఘటనలు పెరిగాయని వైద్య నిపు ణులు చెబుతున్నారు.అప్పటి వరకు ఉత్సాహంగా ఉన్న మనిషి ఉన్నట్టుండి కుప్పకూలి, తిరిగి లేవడం లేదు. ఛాతిలో ఇబ్బందిగా అనిపిస్తే చాలామంది యువకులు సాధారణమేనని భావిస్తున్నారు. తల నొప్పి వస్తే సొంతంగా మందులు కొనుక్కొని వాడుతున్నారు. కడుపులో నొప్పి వస్తే అసిడిటీ అనుకొని ఇతర వైద్యుల వద్దకు వెళ్తున్నారు. కానీ ఛాతినొప్పిని గుండె సమస్య లక్షణాలని అంచనా వేయలేకపోతున్నారు. దీంతో చికిత్స ఆలస్యమై ప్రాణాపాయ స్థితికి దారితీస్తోందని వైద్యులు చెబుతున్నారు. గుండె నొప్పి ఏ కారణం ఏ లక్షణంతో ఉంటుందో తెలియని పరిస్థితి కూడా దీనికి కారణమని కార్డియాలజిస్టులు పేర్కొంటున్నారు. దేశంలో ఏటా గుండె సంబంధిత వ్యాధులతో రెండున్నర లక్షల మంది చనిపోతున్నారు. వీటిల్లో సడన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు కూడా ఉన్నాయి. గతంలో 40 ఏళ్లు దాటిన వారిలోనే ఇలాంటివి సంభవించేవి. కానీ ఇప్పుడు యువతీయువకుల్లోనూ సడన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో హఠాత్తుగా అడ్డంకులు ఏర్పడటాన్ని గుండెపోటు అంటారు. మరి గుండెకు రక్తం, ఆక్సిజన్ సరిగా అందకపోతే అది పంపింగ్ చేయ లేదు. ఎంత ఎక్కువసేపు అడ్డంకి ఏర్పడితే గుండెకు అంత నష్టం ఏర్పడుతుంది. పురుషుల్లో ఇలాంటి గుండెపోటు 65 ఏళ్లకు, మహిళల్లో 70 ఏళ్లకు వస్తాయనేది పాత లెక్క. కానీ ఇటీవల ఆ వయసు క్రమగా తగ్గిపోతుంది. వయసుతో సంబంధం లేకుండా..గుండెపోటు ముప్పు అందరిని చుట్టుముడుతోంది. ముఖ్యంగా యువత, చిన్నారుల్లో సడెన్ హార్ట్ ఎటాక్ కేసులు ఎక్కువగా అవుతున్నాయి.అయితే యువకుల్లో గుండెపోటుకు సంబంధించిన లక్షణాలు కనిపించకపోవడం అతిపెద్ద సమస్య. చాలా సార్లు నిశబ్దంగా విరుచుకుపడి.. ప్రాణాల మీదకు వస్తుంది. ఇలా వరుసగా జరుగుతున్న సైలెంట్ గుండెపోటు మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి.ఈ నేపథ్యలో ఎవరైనా అకస్మిక గుండెపోటుకు గురైనప్పుడు సమీపంలో ఉన్న వారు వెంటనే సీపీఆర్ చేస్తే గుండె తిరిగి కొట్టుకునేందుకు, తద్వారా ప్రాణాలు కాపాడేందుకు అవకావం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. సీపీఆర్ సులభంగా చేసేందుకు వీలతున్న టెక్నిక్. కానీ అదేమిటో, ఎలా చేయాలో ఏ కొద్ది మందికో తప్ప చాలా మందికి తెలియకపోవడం వల్ల బాధితులు కళ్లెదుటే చనిపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటోంది.మన దేశంలో పెద్ద ఆసుపత్రుల్లో తప్ప చిన్న ఆసుపత్రుల్లోని సిబ్బందికి కూడా సీపీఆర్‌పై సరైన శిక్షణ లేకపోవడం గమనార్హం.



బంజారాహిల్స్‌లో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మిస్ ఇండియా ఫస్ట్ రన్నర్ ఆఫ్ రుబెల్ షేకవాత్

## వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వేతన సవరణ కాలపరిమితి ముగిసినందున వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం చిక్కడపల్లిలోని పి అండ్ టి కాలనీలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని సమావేశం ఆరోపించింది. ఎంప్లాయిస్ హెల్త్‌స్కీం లోపభుయిష్టంగా తయారైందని, నగదు రహిత వైద్యం ఎక్కడా అందుబాటులో లేదని సమావేశంలో పాల్గొన్నవారు ధ్వజమెత్తారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చా రంగయ్య, సీతారామ్, అరుణ రామ్మోహనరావు, వైకుంఠం, సుజవతి, రాష్ట్ర కార్యదర్శి శశికాంత్ పాల్గొన్నారు.

# నగరానికి దూరంగా డాగ్స్ పార్కును ఏర్పాటు చేయాలి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : నగరానికి దూరంగా డాగ్స్ పార్కును ఏర్పాటు చేసి అక్కడకు కుక్కలను తరలించాలని పలుకాలనీలవాసులు డిమాండ్ చేశారు. యూసుఫ్‌గూడ, జిహెచ్ఎంసి సర్కిల్ 19 కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రతిరోజు కుక్కలు దాడులు చేస్తున్నా జిహెచ్ఎంసి శాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. పగలు రాత్రి తేడాలేకుండా ఇంటి నుంచి బయటకు వస్తే ఎక్కడ కుక్కలు దాడీ చేస్తాయోనని భయంతో వణికిపోతున్నామన్నారు. ఒకవైపు మనుషుల ప్రాణాలను తీస్తున్నా అటు అధికారులు గాని, ఇటు ప్రజా ప్రతినిదులుగాని తమకేమి పట్టనట్టుగా చలనం లేకుండా ఉండటం ఆందోళన కలిగిస్తున్నట్టు పేర్కొన్నారు. మనుషుల ప్రాణాలంటే లెక్కలేకుండా పోతుందని, మరికొందరైతే కుక్కలను రక్షించాలని దాడులు చేస్తున్నా వాటినేమీ అనకూడదన్నట్టుగా మాట్లాడటం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. చిన్నారులు, వృద్దులు, మహిళలపై దాడులు చేస్తున్న వీధి శునకాలమీద ప్రభుత్వానికి అంతప్రేమ ఉంటే నగరానికి నాలుగువైపులా నాలుగు డాగ్ పార్కులను ఏర్పాటు చేసి ప్రతి రోజు వాటికి భోజనాన్ని మందులను అందించి రక్షించుకోవాలని సూచించారు.కుక్కల ప్రేమికులను కూడా అక్కడికే వెళ్లి భోజనం వాటికి పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాని నిర్లక్ష్యంగా ఇలా వీధి కుక్కలను వదిలేస్తే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. ఆయా కాలనీల ప్రతినిధుల సమస్యలను విన్న డిఎంసీ రమేష్ మాట్లాడుతూ కుక్కల దాడుల విషయాన్ని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్ళి తప్పకుండా తగిన న్యాయం చేస్తామని హామినిచ్చారు. వీదిశునకాలను శేరిలింగంపల్లి సిబ్బంది పట్టుకెళతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్, రాజీవ్‌నగర్, కళ్యాణ్‌నగర్, సారధీనగర్, తదితర కాలనీల ప్రతినిధులు చిలకల వెంకటేశ్వరరావు, అర్జున్, కోడె సాంబశివరావు, కళ్యాణ చక్రవర్తి, శౌరిరాజు, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

**వీధి కుక్కల నుంచి కాపాడుకోవడంపై విద్యార్థులకు అవగాహన**



మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వీధి కుక్కల దాడి నుంచి ఎలా కాపాడుకోవాన్న అంశంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నార్సింగి..** వీధి కుక్కల దాడి నుంచి మనలను మనం కాపాడుకోవడం ఎలా అన్న అంశంపై శనివారం మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. నిష్ణాతులైన సిబ్బందితో, శిక్షణ పొందిన శునకంను తీసుకువచ్చి నడుచుకుంటూ వెళ్తుంటే కుక్క దాడి చేస్తే ఎలా తప్పించుకోవాలి? దాన్ని ఎలా నిలువరించాలి? ఇతరుల సహాయం కోసం ఎలా అరువాలి? అన్న అంశాలను డెమో చేసి చూపించారు. పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో విద్యార్థులు కుక్కలపై రాళ్లు విసురకూడదని సూచించారు. అనంతరం కమీషనర్ ఫల్గుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత జంతు సంరక్షణ చట్టాలను అనుసరించి కుక్కలను తరిమివేయడం కానీ, చంపడం కానీ నేరం అవుతుందన్నారు. అయితే ఈ వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, టీకాలు కూడా వేయి స్తున్నామన్నారు. ఆపరేషన్ల తరువాత ఎక్కడి నుంచి పట్టుకెళ్తున్నామో అక్కడే వదిలి పెడుతున్నామని వివరించారు. ప్రజలు సైతం తమ బిడ్డలను జాగ్రత్తగా కాపాడుకోవాలని, షాపులకు, పాఠశాలలకు ఒంటరిగా కాకుండా జంటగా పంపించడం చేయాలని మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఇ సంపత్, అధికారులు నవీన్, జయశ్రీ, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### గాంధీనగర్‌లో కుక్క దాడితో ఒకరికి గాయాలు



గాయపడ్డ వ్యక్తి

**చిక్కడపల్లి..** గాంధీనగర్ డివిజన్‌లోని గాంధీనగర్ కెనరాబ్యాంక్ వద్ద శనివారం కుక్క కాటుకు ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం సాయంత్రం స్థానికంగా నివసించే సూర్యనారాయణ పనిపై బయటకు రావడంతో గుంపుగా ఉన్న కుక్కలోంచి ఒక కుక్క అతడిపై దాడి చేయడంతో ఆయన కిందపడిపోవడంతో గాయపరిచింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ గాంధీనగర్ మోర్ సూపర్‌మార్కెట్ సమీపంలో వీధిలో కుక్కల బెడద విపరీతంగా ఉందని, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్, వెటర్నరీ అధికారులఉ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

## జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయి : రమణాచారి


పాండురంగారావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న డా.కె.వి.రమణాచారి

సైఫాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: మానవుడు జీవితం ఎప్పుడు ఏలా ఉంటుందో ఎవరికి తెలియదని, ఒడలు బండ్లవుతాయని, బండ్లు ఓడలావు తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి చెప్పారు. అయితే నిరుత్సహం చెందకుండా అశావాహు లుగా జీవించాలని సూచించారు. 'భరత్ కళాప్రపూర్ణ' నటరాజ రామకృష్ణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవళి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో జరిగిన శాస్త్రీయ నృత్య, సాంస్కృతిక కదంబ కార్యక్రమం, ప్రముఖ కవి గాయక సంగీత దర్శకులు రాగశ్రీ పాండురంగారావు జీవిత సాఫల్య పురస్కార సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. పాండురంగారావు కవిగా, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా సమాజానికి విశేషమైన సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. ఈ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ అధ్యక్షత వహించగా, విశ్వజన కళామండలి అధ్యక్షుడు మాస్టార్జీ, నంది అవార్డు గ్రహీత అశోక్‌పవార్, రవళి రమేష్‌బాబు, జి.శాంతికుమారి.జోత్స్యరాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగారావుకు జీవిత సాఫల్య పురస్కారం కింద 51 వేల రూపాయల నగదును ప్రదానం చేశారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : లాస్య నందిత


కంటోన్మెంట్ ఎమ్మెల్యే క్యాంప్ వద్ద సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మాజీ కార్పోరేటర్ లాస్య నందిత, బిఆర్ఎస్ నేతలు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు మృత్యువాత పడకుండా కార్పోరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే సాయన్న కూతురు, మాజీ కార్పోరేటర్ లాస్య నందిత తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 16 మందికి మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే సాయన్న క్యాంప్ కార్యాలయంలో లాస్య నందిత, నివేదితల చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు కిరణ్ కుమార్, ఆనంద్ బాబు, సదానంద్ గౌడ్, భాస్కర్ ముదిరాజ్, సనాది శ్రీను, నాగినేని సరిత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర పార్కు సుందరీకరణ పనులను ప్రారంభించిన మ్మెల్యే


నరేంద్రపార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : నల్లకుంట డివిజన్ పరిధిలోని నరేంద్ర పార్కు అభివృద్ధికి 42లక్షలు వ్యయం చేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం డివిజన్ కార్పొరేటర్ ఎన్.అమృతతో కలిసి పార్కు సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన నరేంద్ర పార్కులో అనేక సమస్యలు నెలకొన్ని ఉన్నాయని.. కాలనీవాసుల అభిప్రాయలకు అనుగుణంగా అందంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పార్కు చుట్టూ కొత్త ప్రహరీ గోడ, కొత్త ఫుట్‌పాత్‌వే, చిన్న పిల్లలకు ఆట పరికరాలు,అందమైన గ్లీనరీ, పూల మొక్కలు వంటి వాటితో పాటు సీనియర్ సిటిజన్స్, వృద్దులు సాయంకాలం సేద తీరేందుకు ప్రత్యేక వసతిని కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే కాలనీవాసుల ఆలోచనలకు అనుగుణంగా ఈ పార్కును తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.త్వరలోనే మరోసారి కాలనీవాసులతో కలిసి చర్చించి సమస్యల రహితంగా కాలనీని తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర పార్కు అసోసియేషన్ ప్రతినిధులు, బిఆర్ఎస్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంలో యునానీ వైద్యంపై ప్రత్యేక ఎగ్జిబిషన్


రాష్ట్ర అయూష్ కమిషనర్ ఎం.ప్రశాంతి యునానీ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న దృశ్యం

చార్మినార్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఖాళీగా యున్న యునానీ డాక్టర్ల పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నదని రాష్ట్ర అయూష్ కమిషనర్ ఎం.ప్రశాంతి తెలిపారు.అల్ ఆరిఫ్ జనరల్ ఆసుపత్రి,యునానీ రీసెర్చ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాలార్‌జంగ్ మ్యూజియంలో యునానీ (హెర్బల్) సింగిల్ డ్రగ్స్ ఫర్ పబ్లిక్ హెల్త్ అన్న అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేల సంవత్సరాలు నుంచి యునానీ వైద్యానికి ఎంతో ఆధరణ ఉందని,యునానీ ఆసుపత్రులలో ఖాళీగా యున్న డాక్టర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయటానికి అన్ని చర్యలు తీసుకున్నదని తెలిపారు.చార్మినార్ యునానీ ఆసుపత్రిలో మందుల కొరత లేదని,రోగులకు మంచి వైద్య సేవలు అందిస్తున్నామని ఆమె తెలియజేశారు.సాలార్‌జంగ్ మ్యూజియంలో యునానీ మందులపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినందుకు అభినందిస్తున్నానని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్‌టాక్స్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ వసీం ఉర్ రెహ్మాన్,చార్మినార్ యునానీ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్.షెహ జాది,డాక్టర్లు తౌఫీద్,నజీబ్‌తో పాటు పలువురు యునానీ వైద్యులు పాల్గొన్నారు.కాగా ఎగ్జిబిషన్‌లో యునానీ మందులు తయారు చేయటానికి ఉపయోగించి పలు రకాల వన మూలికలు,ఇతర ఔషదాలను ఏర్పాటు చేశారు.

## ప్రతిభను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం


మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్‌లో వైజ్ఞానికి ప్రదర్శనలో నమూనాలను పరిశీలిస్తున్న పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : విద్యార్థులకు చదువుతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్ డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్ అన్నారు. శనివారం మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్‌లో ఘనంగా సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. 3 రోజుల పాటు ఈ వేడుకలు ఉంటాయని పాఠశాలలోని విద్యార్థులు వారి వారి మేథోశక్తితో వివిధ రకాల నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఇందులో రాకెట్, ఫైర్ అలారమ్, లేజర్ సెక్యూరిటీ అలారమ్, త్రీడీ హోలోగ్రామ్, వాటర్ సైకిలింగ్, సాధారణ వ్యవసాయ పద్దతి, గుండె పనిచేసే విధానం, కిడ్నీలు పనిచేసే విధానం, వాయు కాలుష్యం, ఆరోగ్యకరమైన వాతావరణ, మానవ అస్థిపంజరం, జలవనరులు, డ్యాములు, పల్లెటూరి వాతావరణం తదితర నమూనాలను ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వైజ్ఞానిక దినోత్సవంను ఫిబ్రవరి 28వ తేదీన నిర్వహించనున్నామని ప్రతిభకనపరిచిన విద్యార్థులకు అమీర్‌పేట్ డీఈవో యాదయ్య పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గీత, వైస్ ప్రిన్సిపల్ విమల, రాజేశ్వరి, అనితారావత్, కోఆర్డినేటర్ సాయిరామ్, పూర్ణిమ, కుముదవల్లి రాధిక, భవాని, దీప్తి, కల్పన, కిరణ్‌సింగ్, మృదుల, మాధవి, సుశీల, శ్రీదేవి, సుమలత, లీలా, బాను సౌందర్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యనందించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: న్యాయ విద్యార్థులకు ఉన్నతమైన విలువలతో కూడిన విద్యనందించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ హాజరై పురస్కారాలను అందించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల రూపొందించిన 'విద్యార్థుల పుస్తక సంపుటి' ఆవిష్కరించారు. న్యాయ విద్యార్థులకు ఉన్నతమైన విలువలతో కూడిన న్యాయవిద్యను అందించడంతోనే సమాజంలోని బేధాలను నిర్మూలించగలమని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ టి.అపర్ణ మాట్లాడుతూ న్యాయవిద్యలో తగిన మార్పులు చేయబడినవని, వాటిని అనుసరించి ఉన్నతవిద్యను అవలంభించాలన్నారు. కార్యక్రమంలో వాసవీ విద్యాసంస్థల అధ్యక్షుడు పి.రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు టి.వి.సుబ్బారావు, కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, సభ్యులు, పెండేకంటి న్యాయకళాశాల ప్రిన్సిపాల్ పి.అరవింద, ఉపాధ్యక్షులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### రజక, నాయీబ్రాహ్మణుల ఫెడరేషన్‌లకు ఉచిత విద్యుత్తు పథకానికి రూ.75కోట్లు విడుదల

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని రజక, నాయీబ్రాహ్మణుల ఫెడరేషన్‌లకు ఉచిత విద్యుత్తు పథకానికి రూ.75కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని ఎంబిసి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ వివరించారు.

## విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలి :మహాలక్ష్మీరామన్‌గౌడ్


అకాడమీక్ ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్, కోఠి ఉమెన్స్ కాలేజీ వైస్-ప్రిన్సిపల్ డా.శైలజా ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులలో ఎంతో మేధాశక్తి ఉందని దాన్ని భయటకు తీస్తే గోప్ప విజయాలను సాధించవచ్చునని వారన్నారు. శనివారం నారాయణగూడలోని నారాయణ పాఠశాలలో అకాడమీక్ ఫేర్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని, ఇందుకు తల్లిదండ్రులు పూర్తిగా సహకరించాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులు వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన మోడల్స్ అందరిని అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హర్‌నీత్‌కౌర్, ప్రాథిమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహి ఉన్నిసా, ఎఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్‌గా ప్రొఫెసర్ జె.చీనా నాయక్ బాధ్యతలు స్వీకరణ


ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జె.చీనా నాయక్‌ను ఉద్యోగులు సన్మానిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం,రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్‌గా ప్రొఫెసర్ జె.చీనా నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్దులకు మంచి విద్యా బోధన, మౌళిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా కళాశాలలను తీర్చిదిద్దుతామని,విద్యార్దులు అత్యున్నత ప్రమాణాలు చేరుకునే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కాగా గతంలో ఆయన విశ్వ విద్యాలయంలోని పలు ఉద్యాన పరిశోధన కేంద్రాలలో వివిధ హోదాలలో పని చేశారు.ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జె.చీనా నాయక్‌ను పలువురు ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు.

## ప్రజా సమస్యలను గాలికి వదిలిపెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం

**మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

తార్నాక, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలిపెట్టిందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. రాఘవేంద్రనగర్ కాలనీలో ప్రజా గోస.. బిజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధిల పోతగాని గోపాల్ గౌడ్ ఆద్వర్యంలో బూత్ అధ్యక్షుడు క్రాంతి కుమార్, వెంకట్, సురేందర్ బిజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. రానుంది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. బీజేపీ వచ్చిన తరువాత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మల్క ప్రకాష్, సీనియర్ నాయకులు పద్మారెడ్డి, అనితా రెడ్డి, పోతగాని విజయలక్ష్మి, మంజులా వాణి, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, రవీందర్ రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బండి సంజయ్ మతపరమైన రాజకీయాలు మానుకోవాలి

**గజ్జెల కాంతం**

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌పై తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం విరుచుకుపడ్డాడు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో గజ్జెల కాంతం మాట్లాడుతూ బండి సంజయ్ మతపరమైన రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. బండి సంజయ్‌కు చిత్తశుద్ధి ఉంటే కరీంనగర్‌లో కులపరమైన దాడి చేసిన నీ అనుచరులపై చర్యలేవి అని ప్రశ్నిచారు.ప్రీతి ఆత్మహత్య ఘటన చాలా బాధకరమన్నారు. ప్రీతి ఘటనలో ఆమె కోలుకుంటే తప్ప పూర్తి వివరాలు బయటకు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఘటనపై తెలంగాణ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి విచారిస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అదానిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఒరుగంటి వెంకటేష్ గౌడ్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### అద్భుతంగా సాగిన 'సినీ సంగీతోత్సవం'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని సిటీ కల్చరల్ కేంద్రంలో హన్వీ ధృవణ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్స్, హెచ్‌డి ఆర్ట్, నిర్వాహక సంస్థ అధినేత కరవోకే జాక్, గాయకుడు వీరేందర్ ఆధ్వర్యంలో జరిగిన 'సినీ సంగీతోత్సవం' అందరిని అలరించింది. ముఖ్యఅతిథిగా కళాబ్రహ్మ, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీరామరాజు హాజరై అద్భుతంగా గానం చేసిన గాయనీ గాయకులను సత్కరించి అభినందించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా జీఎస్. ఆర్ట్స్ అధినేత, ప్రముఖ గాయకుడు, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కల్చరల్ సెక్రటరీ జి.శ్రీనివాస్, రచయిత డాక్టర్ ఆలూరి విల్సన్, కళాప్రియులు వినోద్‌గౌడ్, గుజరాతి బ్రాహ్మిణ్ సమాజ్ అధ్యక్షుడు తరుణ్ మెహతా పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దృష్టికి కాలనీ సమస్యలు.. పరిష్కారానికి హామీ


వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కెపి వివేకానంద్

నిజాంపేట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 30వ డివిజన్ స్ప్రింగ్ విల్లా కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తాము ఎదుర్కొంటున్న దోమల బెడద, డ్రైనేజీ, వీధి ధీపాలు, పార్కుల అభివృద్ధి, డంపింగ్‌యార్డు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి,డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు మీనారెడ్డి, దేవి ముదిరాజ్, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే ప్రగతి యాత్ర

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్‌లో శ నివారం ప్రగతి యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డివిజన్‌లోని కౌసల్య కాలనీ, సాయి కృష్ణజ హిల్స్ ప్రాంతాలలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లైబ్రరీ భవన నిర్మాణం, ఎస్ఎన్‌డిపి నాలా పనులను పరిశీలించి కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కు అభివృద్ధికి కేటాయించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్,ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను భూస్థాపితం చేయాలి : మేకల సారంగపాని


తుకారాంగేట్‌లో ప్రజా గోస బిజెపి భరోసా కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న కన్నాభిరామ్,మేకల సారంగపాని

అడ్డగుట్ట,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిన్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను భూస్థాపితం చేయాలని మహంకాలి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని పిలుపునిచ్చారు. బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు శక్తికేంద్రం ఇన్‌ఛార్జి సి.హెచ్. కన్నాభిరామ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తుకారాంగేట్‌లోని గోల్ బావి వద్ద తలపెట్టిన ప్రజా గోస బిజెపి భరోసా శక్తి కేంద్రం కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. అడ్డగుట్టలో 50 పడకల ఆసుపత్రి నిర్మించడంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించడంలో డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఘోరంగా విఫలమైయ్యారని ఆరోపించారు. ఇటువంటి వారికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు వెంకటేశ్ గౌడ్, డివిజన్ ఇన్‌ఛార్జి లింగన్న, నాయకులు మహేశ్ గౌడ్, సాయిబాబా, హంసరాజ్, గెల్లు ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యనేర్చుకోవాలి

**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి**


విధ్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: విధ్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనేర్చుకోవాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాకలోని సెయింట్ ఆన్స్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విధ్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సంస్కారం, క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విధ్యార్థులతో పాటు ప్రిన్సిపల్, పేరెంట్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధ్యార్థులు వివిద సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

## వైభవంగా హారేక్రిష్ణ నామ్ సంకీర్తన



చార్మినార్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ అన్నారు.హైదరాబాద్ హారేక్రిష్ణ నామ్ సంకీర్తన కమిటి ఆధ్వర్యంలో శనివారం కులీకుతుబ్‌షా స్టేడియంలో జరిగిన శ్రీ హరేక్రిష్ణ నామ్ సంకీర్తన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా హరేక్రిష్ణ నామ్ సంకీర్తన్ కార్యక్రమం జరుగుతుందని,పశ్చిమ బెంగాల్‌కు చెందిన గాయకులతో భజనను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఆదివారం కుడా స్టేడియంలో వైద్య జరుగుతుందని ఆయన తెలియజేశారు.కాగా కుడా స్టేడియంలో శనివారం జరిగిన భజన కార్యక్రమంలో ఘాన్సీ బజార్,కోకరివాడి,ఝాలా, గుల్జారాహౌస్,పంజేషా,చేలాపుర,చార్‌మహల్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన బెంగాలీలు పాల్గొన్నారు.

## ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


చెత్తను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ హేమలతారెడ్డి

జీడిమెట్ల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని శివా హిల్స్, శివాలయ నగర్, రాజిరెడ్డినగర్ ప్రధాన రహదారుల పక్కను ఉన్న చెత్తా చెదారాలను శనివారం కార్పొరేటర్ హేమలతారెడ్డి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలందరు చెత్తా చెదారాలను ఖాళీ ప్రదేశంలో పడవేయకుండా ఇంటింటి వచ్చే స్వచ్ఛ ఆటోలలో వేయాలన్నారు. అదే విధంగా తడి,పొడి చెత్తలను విడివి డిగా డబ్బాలో వేయాలని, తమ ఇంటి పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, నాయకులు విజయ్‌కుమార్, తిరుపతి,పద్మావతి, సంగమేశ్వరుడు, సత్యనారాయణ, జహంగీర్, రాజు గౌడ్, ఆరిఫ్, దేవిక తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మెహిదీపట్నం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు అన్నారు. కార్వాన్ బాంజవాడి సరస్వతి శిశుమందిర్ వద్ద శనివారం స్థానిక బిఆర్ఎస్ నాయకులు పట్లూరి రఘు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెపిటి రైస్ డిపోను ప్రారంభించిన అనంతరం లబ్ధిదారునికి సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ...ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్‌కు చెందిన బీరేందర్‌సింగ్‌కు సీఎం సహాయ నిధి ద్వార మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్, సీనియర్ నాయకులు కావూరి వెంకటేష్, శ్రీదర్‌సాగర్, ముత్యాల భాస్కర్, క్రిష్ణదాస్ స్థానికులు పాల్గొన్నారు.

### వరదనీటి కాల్వ అభివృద్ధికి రూ.20 కోట్లు నిధులు మంజూరు చేయాలి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: కూకటపల్లి, కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న వరద నీటి కాల్వ నిర్మాణానికి 20 కోట్ల రూపాయలను నిధులు విడుదల చేయాలని కోరుతూ శనివారం మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావ్‌కు వినతిపత్రం అందజేశారు. 2 నియోజకవర్గాల పరిధిలో ఉన్న బోయిన్‌పల్లి డివిజన్ ఆర్ఆర్.నగర్, వరంగల్ రైస్ మిల్లు మీదుగా ఉన్న 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న నాలా అభివృద్ధికి 20 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరిసింహా యాదవ్,పాండు యాదవ్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే సాయన్న చేసిన సేవలు మరువలేనివి

కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని రైల్ నిలయం అంబేద్కర్ నగర్ బస్తీ నాయకులు పంగ రాజయ్య, ఎల్. పెద్దరాజు, ఎస్.బాలనర్సింహా, తాటికాయల యేసురత్నంలు తెలిపారు. శనివారం రైల్ నిలయం అంబేద్కర్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బస్తీ నాయకులు యేసుదాస్, పాల్గొన్నారు.

## అదానీ, అంబానీలకు దేశ సంపదను దాచుకోగలిగే సౌలభ్యం మోదీ కల్పించారు

**తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవారాజన్**


ప్రసంగిస్తున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవారాజన్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: కొత్త మాఫియా క్యాపిటలిజం నిర్మాతలు అదానీ, అంబానీలకు దేశ సంపదను దాచుకోగలిగే సౌలభ్యం ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల్పిస్తున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవారాజన్ విమర్శించారు. మోదీ ఒత్తిడితో ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసిలు సామాన్య ప్రజల సొమ్మును తీసుకెళ్ళి అదాని కంపెనీలలో వేల కోట్లు పెట్టుబడి పెట్టాయని, ఇప్పుడు అదానీ కంపెనీలు ఒక్కొక్కటి దివాళా తీస్తున్నాయని, దీంతో బ్యాంకులు, ఎల్ఐసి కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని, బ్యాంకులు, ఎల్ఐసిలలో ప్రజలు భద్రపరుచుకున్న వారి కష్టార్జితం సొమ్ముకు ఎవరు బాధ్యులని, ప్రధానీ మోదీ విడి దేశప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభల మూడవ రోజు సభలో దేవారాజన్ ప్రారంభోపన్యాసం చేశారు. ఫార్వర్డ్‌బ్లాక్ మరింత బలపడి దేశ ప్రజల ప్రయోజనాల కోసం అనేక ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తూవుల ధరలు, నిరుద్యోగం, నిరాశ్రయత దేశ ప్రజలను కోలుకోలేని విధంగా చేస్తున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం సమాఖ్యవాదానికి విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు. మోదీ నిరంకుశ విధానాలను వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు మాత్రమే గట్టిగా ప్రతిఘటించగలవని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాన్ని క్రమబద్ధీకరించడానికి వామపక్ష-ప్రజాస్వామ్య-లౌకిక వేదికను బలోపేతం చేయడం తక్షణ అవసరమన్నారు. ఎఐఎఫ్‌బి జాతీయ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిస్వాస్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మాణాలపై వివిధ రాష్ట్ర ప్రతినిధులు చర్చించారు. ఎఐఎఫ్‌బి పశ్చిమబెంగాల్ ప్రధాన కార్యదర్శి నరేన్ ఛటర్జీ, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి, లక్ష్మీపాధి(ఒడిశా) కలాథిల్ విజయన్(కేరళ), కొంబయ్య పాండియన్(తమిళనాడు), అమెరికా మహతో(బీహార్), కైలాష్ మిశ్రా(ఉత్తర్‌ప్రదేశ్), సిమంత మిత్ర(బెంగాల్), హరేన్ బోర్గోహాయిన్(అసోం), ఎస్ఎస్. చౌహాన్(ఢిల్లీ), షాహిద్ మంజూర్(కశ్మీర్) తదితరులు మహాసభలో చర్చల్లో పాల్గొన్నారు. విభజన శక్తుల బారి నుంచి మన దేశాన్ని రక్షించేందుకు 2024లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు తక్షణ అవకాశంగా నిలుస్తాయని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. ఈ మహాసభలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు, మహాసభల ఆహ్వానసంఘం సభ్యులు సుందర రామరాజు, కె.తేజదీప్‌రెడ్డి, బి.రాములు యాదవ్, జి.వంశీధరరెడ్డి, ఫిరంగి రాములు, కొత్తపల్లి రాజు, అందే బీరయ్య, కొమ్మూరి వెంకటేశ్, ఆవుల శ్రీకాంత్‌యాదవ్, సయ్యద్ తౌఫిక్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## అయుష్మాన్ భారత్ భీమా కార్డుతో అనేక ఉపయోగాలు




**లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ భీమా కార్డు నమోదు చేయిస్తున్న నాయకులు**

మెహిదీపట్నం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా హెల్త్ కార్డుల నమోదు ప్రక్రియను శనివారం గుడిమల్కాపూర్ డివిజన్ శ్రీకృష్ణ భవన్‌లో బిజెపి యువ నాయకులు దేవర వంశీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ భీమా కార్డుతో అనేక ఉపయోగాలున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నామ యాదగిరి నేత, సుధాకర్ యాదవ్, సందేశ్ యాదవ్, వెంకటేష్, మధుసూదన్, అశ్విన్ మోదీ, ప్రభుపూజారి బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ఖేలో తెలంగాణ జీతో తెలంగాణ టోర్నమెంట్ 5వ రోజు ప్రారంభం



**క్రీడలను ప్రారంభిస్తున్న జి.కావ్యాకిషన్‌రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: ఖేలో తెలంగాణ జీతో తెలంగాణ టోర్నమెంట్‌లో భాగంగా 5వ రోజు శనివారం అంబర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జి.కావ్యారెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొని క్రికెట్ టోర్న మెంట్‌ను ప్రారంభించారు. అలాగే నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, గ్రౌండ్ ఆర్గనైజర్స్ ఎం.మధుసూదన్‌యాదవ్, అచ్చిని రమేష్, ఎన్.దుర్గాప్రసాద్, రాఘవ్, మధుసూదన్, సుమన్, మల్లికార్జున్, సంధ్య తదితరులు పాల్గొని క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

## మచ్చబొల్లారంలో ప్రజాగోస బిజెపి భరోసా




**స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో నేతలు**

అల్వాల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: మచ్చబొల్లారంలో ప్రజాగోస బిజెపి భరోసా పేరుతో స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ సీనియర్ నేత బాలలింగం మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బలంగా ప్రజలులోకి తీసుకుని వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. ఎంజీ నగర్ ప్రజలు మోత్కుల కుంట చెరువు డ్రైనేజీ దుర్గంధం సమస్యలు వెంటాడుతున్నాయని ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి దండుగుల వెంకటేష్ తెలిపారు.ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పార్టీ నేతలు నడుం బిగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్ చౌదరి వినయ్ భాస్కర్ తిరుపతి రెడ్డి గోపి ఆనంద్ బాల్‌రెడ్డి అనీల్ రాజ్ అజిత్ సాయిసుజాత పాల్గొన్నారు.

## గంగపుత్ర సంఘం అధ్యక్షుడి మల్లయ్య మరణం విచారకరం



**ఏఎల్ మల్లయ్య భౌతిక గాయానికి నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు**

ధర్నాచౌక్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త: గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏ.ఎల్.మల్లయ్య (85) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. పేదల పెన్నిధిగా, సేవామూర్తిగా పేరుగాంచిన మల్లయ్య కు పలువురు నేతలు నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ మత్స్య సహకార సంఘాల సమాఖ్య రాష్ట్ర ఛైర్మన్‌గా, కేంద్ర ప్రభుత్వంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిషనరీస్ మెంబర్‌గా, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిషర్మెన్ ఛైర్మన్‌గా పదవులు నిర్వర్తించిన ఏఎల్ ఎల్ మల్లయ్య 1938లో నల్లగొండ మండలం, నర్సింగ్ బట్ల గ్రామంలో జన్మించారు. మల్లయ్య మరణవార్త తెలిసిన వెంటనే ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మల్లయ్య పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఎంతో మంచి మనిషిగా పేరు సంపాదించుకున్న మల్లయ్య మరణం విచారకరమని అన్నారు. ఏఎల్ మల్లయ్య అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం బన్సీలల్ పేటలోని స్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

## అంబేద్కర్ ఆశయాలు అమలు కానిదే సమాజాభివృద్ధి సాధ్యం కాదు

సైఫాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలు నేరవేరాలంటే సమాజం అభివృద్ధి చెందాలని, ఇందుకు ముఖ్యంగా దళిత, ఆదివాసీ, బలహీన వర్గాల స్త్రీలు అభివృద్ధి చెందాలని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ చెప్పారు. అంబేద్కర్ ఆశయాలను నేరవేరనంత కాలం దేశంలో అభివృద్ధి సాధ్యం కాదన్నారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో శనివారం స్మామాట్ కాంప్లెక్స్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో 'దళిత స్త్రీల సాధికారత-సామాజిక ప్రగతి' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలలో దళిత, ఆదివాసీ స్త్రీల కోసం, బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పడిన మొట్ట మొదటి వేదిక దళిత స్త్రీ శక్తి అని చెప్పారు. డిక్కి జాతీయ కన్వీనర్ పద్మశ్రీ నర్ర రవికుమార్ మాట్లాడుతూ ఓట్ల కోసమే పాలకులు సంక్షేమ పథకాలను ఎరగా చూపి మభ్యపెట్టె సంస్కృతికి ప్రజలు స్వస్తి పలకాలన్నారు. ఈ సభలో శివభాగ్యారావు, నళిని రఘురామన్, ఖలీదా పర్వీన్, వనజాక్షి , కుప్పిలి పద్మ, అంజమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## అంబర్‌పేటలో క్రైస్తవుల స్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



**శ్రీనివాస్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న క్రైస్తవులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: అంబర్‌పేటలో క్రైస్తవులకు స్మశాన వాటిక లేకపోవడంతో ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని అంబర్‌పేటలోని పలు క్రైస్తవ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు సంఘాల ప్రతినిధుల బృందం శనివారం గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా అంబర్‌పేట క్రైస్తవ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాసన్‌రాజు, ఉపాధ్యక్షుడు వల్లభ, వరకుమార్, చంద్రమోహన్ విలియం, హరికృష్ణ తదితరులు మాట్లాడుతూ స్మశాన వాటిక లేకపోతే ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. దురదృష్టవ శాత్తు ఎవరైన చనిపోతే దూరపు ప్రాంతాలకు తీసుకువెళ్ళవలసి వస్తున్నదని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం క్రైస్తవులకు స్మశాన వాటికను కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం బిఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ స్మశాన వాటిక సమస్యలను రాష్ట్ర మంత్రులు కెటిఆర్, టి.హరీష్‌రావు దృష్టికి తీసుకవెళతామని హామీ ఇచ్చారు.

## కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో 8 సీట్లను బిఆర్‌ఎస్ కైవసం చేసుకోవాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి



**కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులతో సమావేశమైన మర్రి రాజశేఖర్ రెడ్డి**

కంటోన్మెంట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డులో ఉన్న పరిధిలో ఉన్న 8 వార్డుల స్థానాలను బిఆర్‌ఎస్ కైవసం చేసుకునేందుకు మాజీ బోర్డు సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులతో బోర్డు ఎన్నికలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే బోర్డు ఎన్నికల్లో బిజెపి,కాంగ్రెస్ వంటి రాజకీయ పార్టీలకు అవకాశం ఇవ్వకుండా అన్ని స్థానాలను కైవసం చేసుకొని కంటోన్మెంట్ బోర్డుపై గులాబి జెండా ఎగర వేస్తామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాథం, ప్రభాకర్, పి.శ్యామ్, నళిని కిరణ్, బిఆర్‌ఎస్ నేతలు పెద్దాల నర్సింహా, ముప్పిడి మధుకర్, శ్రీకాంత్, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలు పట్ల అప్రమత్తత అవసరం: డిసి నాగమణి



**వీది కుక్కలుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిసి**

అల్వాల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: నగర వ్యాప్తంగా వీది కుక్కలు దాడులు నేపథ్యంలో అప్రమత్తత అవసరమని అల్వాల్ సర్కిల్ డిసి నాగమణి పేర్కొన్నారు. శనివారం ఓల్డ్‌అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో వీది కుక్కలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిసి మాట్లాడుతూ కాలనీలు బస్తీలుతో ఉండే వీధి కుక్కలపై బెదిరించచం వంటి చర్యలకు పాల్పడరాదని తెలిపారు. కుక్కలు గుంపులుగా ఉన్న సమయంలో అతి జాగ్రత్త అవసరమన్నారు. ద్విచక్ర వాహనదారులు కుక్కలు వద్ద వేగాన్ని తగ్గించి ప్రయాణించాలని కోరారు. తమ ప్రాం తాలలో అధికంగా కుక్కలు బెడద ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని ఆమె కోరారు.

## వేసవిలో నీటి ఎద్దడి రాకుండా కృషి

**బండ్లగూడ జాగీర్ మేయర్ మహేందర్‌గౌడ్**



**బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లోని జల మండలి కార్యాలయంలో నీటి సరఫరాపై రివ్యూ నిర్వహిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్**

నార్సింగి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో ఈ వేసవి మొత్తం నీటి ఎద్దడి తలెత్త కుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని జల మండలి కార్యాలయంలో జీఎం రవీందర్‌రెడ్డి, మేనేజర్ నరేందర్‌లతో కలిసి ఏఏ ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది? ఎక్కడ వాటర్ సరఫరాను పెంచాలి? అన్న విషయాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి బండ్లగూడ కార్పొరేషన్‌లో నీటి సమస్య రాకుండా ప్రణాలికబద్ధంగా పని చేస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా అందరికి ఉచితంగా మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందని, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు సైతం త్వరలోనే నీటి కనెక్షన్లు ఇచ్చి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అవసరమైన ప్రాంతాలలో వేగంగా మంచినీటి పైప్‌లు వేయిస్తామని, నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్‌ల పనులు త్వరగా పూర్తి చేసి, నీటి కనెక్షన్లు ఇవ్వాలని అధికారులకు ఆదేశించడం జరిగిందని తెలిపారు. అధికారులైనా, ప్రజా ప్రతినిధులైనా ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమే పని చేస్తారని, ప్రజలు ఎక్కడ నీటి ఇబ్బందులు వచ్చినా స్థానిక కార్పొరేటర్ల దృష్టికి తీసుకెళ్లాలని, అయినా ఇబ్బందులు తీరకపోతే కార్పొరేషన్ కార్యాలయంలో గాని, జల మండలి కార్యాలయంలో గాని ఫిర్యాదు చేయాలని మేయర్ సూచించారు.

## 'సుగుణాఢ్య శతకము, మనీషవ్యాఖ్యాగ్రంథ' పరిచయ సభ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: కిన్నెర ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వ ర్యంలో 'సుగుణాఢ్య శతకము, మనీషవ్యాఖ్యాగంథ' పరిచయ సభ శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ గ్రంథ మూలమును ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, మనీష వ్యాఖ్యను ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి చేశారు. మకర హృదయము కృతికర్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య అనుమాండ్ల భూమయ్య ముఖ్యఅతిథిగా హాజరవగా గౌరవ అతిథులుగా గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, శ్రీపదచిత్ర రామాయణ కృతికర్త విహారి(జెఎస్.మూర్తి), అంతరంగ తరంగం కృతికర్త) డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు పాల్గొనగా వ్యాఖ్యానాన్ని రచయిత్రి ఆచార్య వెలువోలు రాజ్యలక్ష్మి నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS

**FOR SALE**

★ **INDUSTRIAL SHED** and Land with Water Power 75 HP for SALE IDA Jeedimetla PHASE 1 North Facing. 1300 sqyds. Mob # **9949292129. No Broker.**

**(Ro.No.55377)**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## క్రీడలతోనే ఆరోగ్యం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**క్రీడలను వీక్షిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

ధర్నాచౌక్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త: విద్యార్థులు, యువత కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడలు కూడా ఆడుతూ ఉండాలని, అప్పుడే వారు ఆరోగ్యంగా వారి వారి రంగాలలో మరింత రాణించగలుగుతారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం దోమలగూడలోని వ్యాయామ కళాశాలలో జరుగుతున్న ఖేలో సికింద్రాబాద్ జీతో సికింద్రాబాద్ క్రికెట్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్స్‌ను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, బీజేపీ నాయకులు రమేష్‌రాం, వెంక టేష్, నవీన్‌గౌడ్, బీజేవైఎం నాయకులు ఏ.వినయ్‌కు మార్, పూసరాజు, సలంద్రి శ్రీనివాసయాదవ్, అరుణ్‌కు మార్, అనిల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లీనరీ సమావేశాలు క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతాయి



**ప్లీనరీ సమావేశంలో పాల్గొనేందుకు బయలుదేరుతున్న సత్యంశ్రీరంగం**

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాలు క్యాడర్ లో ఉత్సాహాన్ని నింపుతున్నాయని పిసిసి సభ్యులు డా.సత్యంశ్రీరంగం పేర్కొన్నారు. శనివారం చత్తీస్‌గడ్ రాయపూర్ వేదికగా జరుగుతున్న ఏఐసీసీ 85వ ప్లీనరీ సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి, నిరంజన్, మేడ్చల్ మల్కాజగిరి అధ్యక్షులు నందికంటి శ్రీధర్, హరివర్ధన్‌రెడ్డి, పిసిసి సభ్యులు డా.సత్యంశ్రీరంగం, భూపతిరెడ్డి, చరణ్ కౌశిక్‌యాదవ్, స్థానిక తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యంశ్రీరంగం మాట్లాడుతూ రాయపూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాలు క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నాయని అన్నారు. పార్టీ రాజ్యాంగంలోని 32 నియమ నిబంధనలకు 16 సవరణలు తీసుకురావాలన్న ప్రతిపాదనలపై ప్లీనరీలో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసేలా సమావేశాలు కొనసాగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో సుదీర్ఘకాలం పార్టీకి అధినేతగా సేవలందించిన సోనియా గాంధీకి ప్లీనరీ సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర ద్వారా, ఇప్పుడు జరుగుతున్న హాథ్‌సేహాథ్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీకి మంచి ప్రజాధరణ వచ్చిందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## వీధి కుక్కల బెడదు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం: జాయింట్ కమిషనర్ శైలజ



**వివిధ విభాగాల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ శైలజ**

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : ప్రమాదకరంగా మారిన వీధి కుక్కల బెడద నుంచి ప్రజలు అరికట్టేందుకు చార్మినార్ జోన్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ జోన్ జిహెచ్‌ఎంసి జాయింట్ కమిషనర్ ఏ.శైలజ తెలిపారు. చార్మినార్ జోన్ జిహెచ్‌ఎంసి కమిషనర్ స్మామాట్ అశోక్ ఆదేశాల మేరకు శనివారం నర్కిపూల్‌బాగ్‌లోని జోన్ కార్యాలయంలో వెటర్నరీ, పారిశుద్ధ్య, యుసిడి విభాగాల అధికారులతో సమన్వయ సమాశంలో ఆఎ మాట్లాడుతూ ఇటీవల జరిగిన వీధి కుక్కల ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. ఫిర్యాదులు అందిన తక్షణమే చర్యలు తీసుకునేందుకు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కుక్కల బెడద నుంచి రక్షించుకునేందుకు ప్రజా ప్రతినిధులు, కాలనీ, బస్తీల సంఘాల సహకారంతో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. పలు హోటల్‌లలో మాంసాహార వ్యర్థాలను వీధిలో చేయకుండా నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే వ్యర్థాలనఉ డంప్ చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో మలక్‌పేట, సంతోష్‌నగర్, చార్మినార్, రాజేంద్రనగర్ సర్కిల్‌ల డిప్యూటి కమిషనర్‌లు, వెటర్నరీ విభాగం, ఏఎమ్ హెచ్‌ఓలు, యుసిడి డిపిఓ. శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## హైటెక్షన్ విద్యుత్ వైర్లు తగిలి ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ మృతి

చార్మినార్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : షాపుకున్న బోర్డుకు మరమ్మతులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు హైటెక్షన్ విద్యుత్ వైర్లు తగిలి యుపికి చెందిన ఓ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ మృతి చెందిన సంఘటన పాతబస్తీ ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం.. యుపికి చెందిన బ్రిజెస్ (36) తన స్నేహితులతో కలిసి పాతబస్తీలోని అన్సారీరోడ్డులో నివాసం ఉంటున్నాడు. జీవనోపాధి కోసం పాతబస్తీకి వచ్చిన బ్రిజెస్ ప్రైవేట్ ఎలక్ట్రిషీయన్‌గా పని చేస్తున్నాడు. కాగా శనివారం బ్రిజెస్ అన్సారీరోడ్డులో ఓ షాపుకున్న బోర్డుకు మరమ్మతులు చేయటానికి వచ్చాడు.షాపు మీదకు ఎక్కి బ్రిజెస్ బోర్డును బిగిస్తున్నాడు. అదే సమయంలో కొంచెం దూరంలో ఉన్న 33 కెవి హైటెక్షన్ విద్యుత్ వైర్లు బ్రిజెస్‌కు తగలటంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.ఈ కేసును ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భూమి పూజ చేసిన మంత్రి



**నాచారం ఇఎస్‌ఐ ఆసుపత్రి ఆవరణలో అమ్మవారి ఆలయానికి భూమిపూజ చేసిన మంత్రి మల్లారెడ్డి**

నాచారం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: నాచారంలోని ఈఎస్‌ఐ హస్పిటల్లో మంత్రి మల్లారెడ్డి శనివారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఆయా వార్డులతో పాటు, ఫార్మసీ విభాగంలో తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బంది, డాక్టర్లకు మంత్రి మల్లారెడ్డి సూచించారు.

**ఆలయ ప్రాంగణంలో కనకదుర్గ ఆలయానికి మంత్రి మల్లారెడ్డి భూమి పూజ**

నాచారం ఎఎస్‌ఐ ఆసుపత్రి ఆవరణంలో ఉన్నన శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి మంత్రి మల్లారెడ్డి స్థానిక ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డితో కలసి భూమి పూజ చేశారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ దర్గ దయాకర్ రెడ్డి, ఈఎస్‌ఐ డైరెక్టర్ వేముల మారయ్య, సూపరెండెంట్ డా. కమల, డాక్టర్లు చీమ శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, బిఆర్‌ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, రవికుమార్, గరిక సుధాకర్, తేతాకుల రఘుపతి రెడ్డి, మేకల ముత్యం రెడ్డి, తుంగ తిరుపతి, శ్రీరాం సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా కూడా ఇంటి పన్నులు చెల్లించవచ్చు : కమిషనర్

నార్సింగి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్యాలయంలోని ఇళ్ల యజమానులు తమ ఇంటి పన్నులను ఇక నుంచి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా కూడా చెల్లించుకోవచ్చని కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. యూపిఐ యాప్స్ అయిన గూగుల్‌పే, ఫోన్‌పే, పేటిఎం, అమెజాన్ పే, మొబివిక్, పయు వంటివి ఉపయోగించి ఇంటి పన్నులు చెల్లించుకోవచ్చని వివరిం చారు. ఇళ్ల యజమానులు తమ ఇంటి అసెస్‌మెంట్ నెంబర్‌ను ఉపయోగించుకొని డిజిటల్ పేమెంట్స్ చేసేందుకు ఈ అవకాశం ను కల్పించడం జరిగిందని, ప్రజలందరూ ఈ అవకాశంను సద్వి నియోగం చేసుకోవాలని కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.






**IN THE COURT OF THE HON'BLE IV ADDL DISTRICT & SESSIONS JUDGE, R.R.DISTRICT, AT: L.B. NAGAR**
**O.S.No. 136 of 2022**

Between:
**1. Mohd. Ameenuddin** S/o Mohd. Sultanubbidin, Aged about 38 years, Occ: Business, R/o H.No. 23-3-39, Sultan Shahi, Awami Hotel, Mogalpura, Charminar, Hyderabad-500002.
**2. Mohd. Raziuddin** S/o Mohd. Sultanubbidin, Aged about 34 years, Occ: Business, R/o H.No. 23-3-38, Sultan Shahi, Mogalpura, Charminar, Hyderabad-500065.
**...Plaintiffs**

And

**15. Khaja Bee** W/o Mohd. Shareef, Aged about 61 years, Occ: Housewife, R/o H.No.23-2-286, Moghalpura, Hyderabad.
**...Defendant No.15**

Please take notice that the above O.S.No. 136 of 2022 is posted to 02.03.2023, for your appearance i.e., Defendant No.15, hence you are hereby directed to appear before above said Hon'ble Court on 02.03.2023 at 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided in your absence, on merits.

//By Order of the Court//
**Sd/- M/s. L. HARISH**
**Advocate**
Flat No.102, 1st Floor, 2-2-1105/37/D, Tilaknagar, New Nallakunta, Hyderabad-44

**CAUTION PUBLIC NOTICE**

This is to inform all the general public and to whomsoever concern that my client **Sri. KISHORE ENUMULA,** S/O Narasaiah Enumula, have entered into Agreement of sale with M/s Spark Realtors Pvt Ltd. represented by its Director Sri. B.J. Kiran Kumar Reddy, S/o Chinnappa Reddy, who is the owner and physical possessor of land in Sy. Nos. 53/E, Sy. No. 53/EE/2, Sy. NO. 53/EE/1, Sy. No. 54/E, Sy. No. 55/AA, Sy. No. 56/UU, situated at Haridaspally village, Keesara Mandal, MedchalMalkajgiri District by virtue of Regd. Development Agreement Cum Irrevocable GPA.Doct. No. 1237/2014, dated 10.03.2014, &Doct. No.3994/2015, dated 23.02.2015 regd. before SRO Keesara, in connection with the Supplementary Agreement DoctNo. 2092/2016, dated 10.03.2016, regd. before SRO Keesara, and a Rectification Deed No. 3923/2020, dated 18.03.2020, towards the Plot No. 59 admeasuring 400.00 SQ. Yards, and Supplementary Agreement Doct. No. 1261/2016, dated 12.02.2016 in respect of Plot No. 44 admeasuring 400.00 Sq. Yards&Plot No. 59 admeasuring 400.00 Sq. Yards in Sy. No.51/P, 52/P, 53/P, 54/P, 55/P, 56/P, 57/P, 58/P, situated at "SINDHU-VANAM" of Haridaspally Village, Keesara Revenue Mandal, MedchalMalkajgiri District covered in HMDA Layout vide Lr. NO. 202396/LO/Plg/HMDA/2015 & Final Layout Permit No. 45/LO/Plg/HMDA/2015, dated 28.06.2019. Land Conversion vide Procd. No. L/2016/2015, dt 19.11.2015, issued by the Spl. Grade Dy. Collector & R.D.O. Malkajgiri Division.
My client had paid substantial amount to M/s Spark Realtors Pvt Ltd., and ready for registration of Plot Nos. 44 admeasuring 400 Sq. yards &Plot No.59 admeasuring 400.00 Sq. Yards.
My client hereby cautions the general public and whomsoever concern and the interested legal heirs/legal representative and that if anybody having any title, right, objection, claim, interest over the above said property they may approach undersigned with all relevant papers within 7 days from the date of this publication, thereafter no claims are accepted or received or will not be entertained.

**P. V. SHRINIVASAN, KATTA MANI REKHA, K. VAISHALI**
**Advocates,**
207 & 208, Aditya Towers, Vinayak Nagar, Neredmet, Secunderabad - 500056.
**9866740895/6304463821/ +45 31 86 46 01**

**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD**
**O.S.No. 3553 of 2022**

Between:
**Canara Bank,** Abids Branch, Hyderabad **...Plaintiff**

And

**Sri V. Rakesh Yadav**
**...Defendant**

To,
**Sri V. Rakesh Yadav** S/o V. Raju Yadav, aged about 30 years, Occ: Business, R/o 4-1-1112/B, Boggulakunta, Hyderabad. Ph No: 9652081662.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.1,98,288/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **09th March, 2023,** at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
**Sd/- N. Venugopala Rao, Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

**IN THE COURT OF THE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD**
**O.S.No. 296 of 2018**

Between:
**Canara Bank,** Malakpet Branch, Hyderabad **...Plaintiff**

And

**Mr. Mohd Afzal Pasha**
**...Defendant**

To,
**Mr. Mohd Afzal Pasha** S/o Mohd Khaja Pasha, aged about 35 years, Occ: Business, R/o 12-11-811, Boudhanagar, Warasiguda, Sec'bad-500061 and ABR Cabs/Travels O/o 12-11-981/4/1, Boudhanagar, Warasiguda, Sec'bad-500061.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,63,500/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **02nd March, 2023,** at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
**Sd/- N. Venugopala Rao, Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

# ఘనంగా అభయాంజనేయ, సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో పూజలు చేసిన మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ ఆర్‌ఎన్‌రెడ్డినగర్ శ్రీ అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి కార్పొరేటర్ సిద్దాల బీరప్ప, ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రిని ఆలయకమిటీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మా నాయక్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మారెడ్డి, కార్పొరేటర్లు ఉయ్యాల నవీన్‌గౌడ్, ఎనుగుల అనిల్ యాదవ్, మమత, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా స్వర్ణ యంత్ర స్థాపన



గోవుకు హారతి ఇస్తున్న చిన్నజీయర్‌స్వామి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో ఈనెల 21వ తారీకునుండి 25వ తేదీ వరకు ఆలయ ముఖద్వారం, స్వర్ణ రథం, ప్రధానసన్నిధిలో శ్రీ మహాలక్ష్మి స్వర్ణయంత్రం స్థాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం దేవాలయం ప్రధానసన్నిధిలో శ్రీమహాలక్ష్మి స్వర్ణయంత్రం స్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి హాజరై ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చిన్న జీయర్‌స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరమాత్ములను ఆరాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామానుజ రామచంద్రజీయర్‌స్వామి, అహోబల రామానుజ జీయర్‌స్వామి, శ్రీ త్రిదండి దేవనాథజీయర్ స్వాములతోపాటు ఆలయం కమిటీ సబ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణలో అధికారం సాధించే దిశగా బిజెపి అడుగులు: కొప్పు బాష

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపికి రోజు రోజుకి ప్రజల ఆదరణ పెరుగుతున్నదని రాష్ట్ర దళిత మోర్చాఅధ్యక్షుడు కొప్పు బాష, పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. బాలాపూర్ మండలం బాలాపూర్ వేణుగోపాలస్వామి ఆలయఆవరణలో శక్తి కేంద్రం ఇంఛార్జి, మాజీ వైస్ ఎంపిపి గడ్డం వెంకటేష్, సహ ఇంఛార్జి కళ్లెం లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్నర్ సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బిజెపి తెలంగాణలో అధికారం సాధించేదిశగా ముందుకు పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.అరవింద్, బి.అభిలాష్‌రెడ్డి, జి.మధు, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జోరల ప్రభాకర్, గుండె నాగార్జున, క్యారగారి సంజీవ, శ్రీశైలం, శివ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ నెహ్రూనగర్‌లో కమ్యూనిటి హాల్ కోసం కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్ పన్నాలకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బస్తీవాసులు

**నాచారం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మల్లాపూర్ నెహ్రూనగర్ బ్లాక్ 1,2,3 బస్తీవాసులు బస్తీలో ఫంక్షన్ హాల్‌ను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. బస్తీకి ఎదురుగా ఉన్న ఖాలీస్థలంలో బస్తీవాసుల కోసం హాల్‌ను నిర్మించాలని బస్తీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. గతంలో ఉప్పల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి పురోగతిలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో నాగారం బాబు, బోదాసు లక్ష్మినారాయణ, శంకర్ నాయక్, సుధాకర్, బర్ల శంకర్, కానాపురం బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి దుర్గయ్యతో తధితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



బాధితుడికి చెక్కును అందిస్తున్న శ్రీధర్‌గౌడ్

**హయత్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యే పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరమని బిఆర్‌ఎస్ హయత్‌నగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్ అన్నారు. హయత్ నగర్‌కు చెందిన అమరగోని బాలరాజుగౌడ్ అనారోగ్యంతో ఆసుపత్రి పాలవగా అతని వైద్యానికి 44 వేల రూపాయలు ఖర్చుయ్యాయి. ఆర్థిక పరిస్థితి బాగోలేని కుటుంబ సభ్యులు శ్రీధర్‌గౌడ్‌ను సంప్రదించారు. ఆయన విషయాన్ని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తెలపగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధినుంచి వైద్య ఖర్చుల మొత్తాన్ని మంజూరు చేయించారు. ఈ మేరకు సదరు చెక్కును శనివారం శ్రీధర్ గౌడ్ బాధితుడికి అందించారు. కార్యక్రమంలో నాయకులు బోడ బిక్షపతి, పారంద రమేష్, చెన్నగోని మదన్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు రాకేష్‌ద్యాగల కుమార్, మహ్మద్ రఫిక్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

# దేవాలయంలోకి అన్య మతస్థుడు -లక్ష్మీనగర్‌లో ఉద్రిక్తత



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మధుకర్‌రెడ్డి, బాలకృష్ణ

**సైదాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** లక్ష్మీనగర్ సాయిబాబా దేవాలయం వార్షికోత్సవాల్లో ముస్లిం మతానికి చెందిన వ్యక్తి ప్రార్థనలు చేయడానికి ప్రయత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. లక్ష్మీనగర్‌లోని సాయిబాబా దేవాలయం వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నారు.అయితే శనివారం మధ్యాహ్నం ముస్లిం మతానికి చెందిన వ్యక్తి దేవాలయంలో ప్రార్థన చేయడానికి ప్రయత్నించడంతో సమాచారం తెలుసుకున్న అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, బిజెపి నాయకులు జంగం మధుకర్‌రెడ్డితోపాటు మరికొందరుఅక్కడకు చేరుకుని ఆ వ్యక్తిని అడ్డుకున్నారు. ఈలోగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకుచేరుకుని ఆందోళన చేస్తున్న వారికి నచ్చ చెప్పి శాంతింప చేశారు. దేవాలయ ఛైర్మన్ ఓ.సత్య వెంకట దుర్గ ప్రసాద్ ప్రోత్సాహంతోనే ముస్లిం వ్యక్తి దేవాలయంలోకి వచ్చి ప్రార్థన చేయడానికి ప్రయత్నించాడని, ఛైర్మన్ దుర్గ ప్రసాద్‌పై తగిన చర్య తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వీరేంద్రబాబు, అమరేందర్ రెడ్డి, లోకేష్ యాదవ్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి వైపు చూస్తున్న ప్రజలు: బొక్క నర్సింహారెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా బిజెపి అధ్యక్షుడు నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** తొమ్మిదేళ్ళ బిఆర్‌ఎస్ పాలనపట్ల విసిగిన తెలంగాణ ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలోపార్టీ శక్తి కేంద్రం ఇంఛార్జిలు జక్కిడి మధుసూదన్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడి నాయకత్వంలోని ప్రభుత్వం జన్‌ధన్ ఖాతాలు, ఆయుష్మాన్ భారత్, ప్రధాని ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, అంత్యోదయ తదితర పథకాల ద్వారా పేదలకు న్యాయం చేస్తుంటే తెలంగాణలో మాత్రం కెసిఆర్ ప్రభుత్వం రైతు బంధు పథకం ద్వారా కోటీశ్వరులకు లాభం చేస్తున్నదని అన్నారు. కెసిఆర్ నిరంకుశ పాలన పట్ల విసుగు చెందుతున్న ప్రజలు బిజెపికి అవకాశం ఇవ్వాలని డిసైడ్ అయ్యారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్,కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇంఛార్జిలు, సహ ఇంఛార్జిలు, బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జల్‌పల్లిలో ప్రజా సమస్యల పరిశీలన

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను శనివారం స్థానిక మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సూరెడ్డి కృష్ణారెడ్డి పరిశీలించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆయన మున్సిపల్ డిఇతో కలిసి జల్‌పల్లి దేవాలయం సమీపంలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. అయితే వచ్చే మంగళవారం నుండి డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం పనులు ప్రారంభం డిఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మైనార్టీలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** జల్‌పల్లి మున్సిపాలిటీలోని జల్‌పల్లిలో మైనారిటీల కోసం స్మశానవాటిక స్థలాన్ని కేటాయించినందుకు స్థానిక మైనారిటీ నేతలు, మత పెద్దలు మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు జల్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ షేక్ జహంగీరుద్దీన్,మాజీ ఎంపిటిసి షేక్ అప్జల్, మత పెద్దలు సయిద్ పటేల్, మహ్మద్ యూసుఫ్ తదితరులు మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి, ఎండి సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం : గోనె శ్రీకాంత్

**ఉప్పల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బిఆర్‌ఎస్ పార్టీ వైఖరిపై పోరాటం తప్పదని బిజెపి చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడు గోనె శ్రీకాంత్‌ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్ కుమ్మరికుంట శక్తి కేంద్రం పరిధిలోని మూడు బూత్‌లలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యమ్రకంలో గోనె శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలో ప్రధాని మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని తెలిపారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలపై పన్నుల భారం మోపిందని, కుటుంబ పాలనను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** జీవో 118కి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని వెరిఫికేషన్ అధికారి మహేందర్ సూచించారు. అసైన్డ్ స్థలాలలో నిర్మాణాలు జరిపిన వారి ఆస్తిపత్రాలను శనివారం పరిశీలించారు. అసైన్డ్ స్థలాలలో నిర్మించిన వారికి చేయనున్న క్రమంలో పలువురి ఆస్తి పత్రాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ నాయకులు అనంతుల రాజారెడ్డి, చిరంజీవి, మల్లేశం, అశోక్ రెడ్డి, ఉమేష్, రాము, రవీందర్ రెడ్డి, అరవింద్ పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో రైతు మార్కెట్ ఎక్కడా..? : కాంగ్రెస్



జోడో యాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న పరమేశ్వర్‌రెడ్డి

**రామంతాపూర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జోడో యాత్ర 15వ రోజుకు చేరుకుంది. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎండి.రఫీక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామంతాపూర్‌లో రైతు మార్కెట్ నిర్మిస్తామని మామీ ఇచ్చిన పాలకుల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కుల సంఘాలకు భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీ నేతల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కుల సంఘాలకు సెంటు భూమి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై కాంగ్రెస్ పార్టీ పోరాటం తీవ్రతరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధులు ఎం.డి.తౌఫిక్, కృష్ణారెడ్డి, బోరంపేట కృష్ణ, తవిడబోయిన గిరిబాబు, సుర్వి మురళీగౌడ్, ఎం.శేఖర్‌గౌడ్, లుకాస్, మంచాల రఘు, ప్యాట మురళీ, ఆగంరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, బాకారం లక్ష్మణ్, కొంపల్లి బాలరాజు, యూత్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, పి.కోటేష్, అకారపు అరుణ్, లింగంపల్లి రామకృష్ణ, అమరేశ్వరి, జలీల్‌పాషా, యోగి విశాల్, దేవిరెడ్డి, సంధ్యారాణి, సతీష్‌గౌడ్, బాబురావు, రేణుక, సుశీల, పి.శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మజ్లిస్, భారాస ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి: హరిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న లింగాల హరిగౌడ్

**సైదాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మజ్లిస్. భారాస ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందని బిజెపి ఓబిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ అన్నారు. బిజెపి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్‌లోని చేపల మార్కెట్‌వద్ద 'ప్రజాగోస-బిజెపి భరోసా' పేరుతో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో హరిగౌడ్ మాట్లాడుతూ మజ్లిస్, భారాసలు రెండు ఒక్కటేనని, ఈ రెండు పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ది చెప్పడం ఖాయమన్నారు. మజ్లిస్ ఆగడాలకు మద్దతు పలుకుతున్న భారాసకు కూడా బుద్ది చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రేమే ందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ భారాస నియంతృత్వ పోకడలు నిజాం పాలనను తలపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సహదేవ్‌యాదవ్, నిరంజన్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

# కార్యకర్తలకు బిఆర్‌ఎస్ పార్టీ అండ : ఎమ్మెల్యే బేతి



బిఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీరప్పగడ్డకు చెందిన బిఆర్‌ఎస్ యువజన నాయకులు పి.మహేష్ కుటుంబ సభ్యులకు పార్టీ నుంచి మంజూరైన రూ. 2లక్షల చెక్‌ను శనివారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్న మహేష్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయనతోపాటు కొద్దిరోజులకే తల్లి మృతి చెందిందని, వారి కుటుంబానికి చేయూత అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహేష్ తండ్రి మైసయ్యకు చెక్ అందజేసినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు బిఆర్‌ఎస్ చేయూత అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పులి జగన్, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, కొక్కొండ జగన్, పండ్ల కిషన్, వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, బింగి శ్రీనివాస్,రామానుజం, బాలు, శ్యామ్, శ్రీకాంత్, గరిక సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# నాచారం ఇండస్ట్రీస్ అసోషియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నాచారం ఇండస్ట్రీస్ అసోషియేషన్ నూతన కార్యవర్గం

**నాచారం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** నాచారం ఇండ్రస్ట్రీస్ సంక్షేమం కోసం తాము నిరంతరం కృషి చేస్తామని నాచారం ఇండస్ట్రీస్ అధ్యక్షులు దినేష్ కుమార్ జైన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం నాచారంలో నూతన కమిటీ ప్రతినిధులతో కలిసి మాట్లాడి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జైన్ చెప్పారు. నాచారం ఇండస్ట్రీస్ నూతన అధ్యక్షులుగా దినేష్‌కుమార్ జైన్, ఉపాధ్యక్షులుగా వి.టి. శివ,కార్యదర్శిగా ఎన్.సురేందర్ రెడ్డి, కోశాధికారిగా భాన్‌జీ బాయిపటేల్, సంయుక్త కార్యయదర్శిగా వి. జైరాజ్, సభ్యులుగా వినయ్‌కుమార్‌జైన్, బి.తిరుపతిరెడ్డి, రాము మలాజీ, విజయేంద్ర బాజ్‌పాయి, వి.వెంకటేశ్వర రావు తధితరులు ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ విష్ణుగుప్త తెలిపారు. ఈ సందర్భంగా నూతనఅధ్యక్షులు దినేష్ జైన్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఇండ్రస్ట్రీస్ కోసం వచ్చే స్కీమ్‌లపై అవగాహన కల్పిస్తామని జిఎస్‌టీ, రాయితీల గురించి పారిశ్రామిక వేత్తలకు అవగహన కల్పిస్తామని వెల్లడించారు.

# అతి త్వరలో అందుబాటులోకి ఆక్సిజన్ పార్క్ : ఎమ్మెల్యే దేవిరెడ్డి



ఆక్సిజన్ పార్క్‌ను పరిశీలిస్తున్న సుదీర్‌రెడ్డి తదితరులు

**మన్సూరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కామినేని ఫ్లై ఓవర్ క్రింద ఉన్న స్థలంలో దాదాపు 390 మీటర్ల స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న ఆక్సీజన్ పార్క్ తుది దశకు చేరుకుంది అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తుది దశకు చేరుకున్న పార్క్ ప్రదేశంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం కారణంగా పర్యావరణానికి హాని కలిగిస్తూ ఓజోన్ పొర పల్చబడుతుందని, కాబట్టి పర్యావరణ పరిరక్షణకు కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. అలాగే దేశంలో ఎక్కడలేని విధంగా నిర్మిస్తున్న ఒక అత్యున్నత ఆక్సీజన్ పార్క్ ఇదనీ తెలిపారు. నాసా, ఢిల్లీ ఐ.ఐ.టీ వారు గుర్తించిన ఆక్సీజన్ ఉత్పత్తి చేసే 26 రకాల 36,000 మొక్కలు కామినేని హాస్పిటల్ ఫ్లై ఓవర్ క్రింద ఉన్న ఈ ఆక్సిజన్ పార్కులో నాటడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే ఆక్సిజన్ పార్క్ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ పర్యటనలో జక్కిడి రఘువీర్‌రెడ్డి, సుమంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# బిజెపితోనే అభివృద్ధి సాధ్యం : భాగ్యలక్ష్మి



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని మూసారాంబాగ్‌డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని గడ్డిఅన్నారంలో జరిగిన కార్నర్ మీటింగ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోడి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. మోడి సారధ్యంలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వారి చైతన్యవంతులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో యాదగిరి రెడ్డి, సందడి సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, గౌర దేవేందర్, లింగాల హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి : శ్రీవాణి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** డివిజన్లో ఉన్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ సూచించారు. డివిజన్‌లోని భగత్‌సింగ్‌నగర్ శివాలయం వద్ద కొత్త సీసీరోడ్ పనులు జరుగుతున్న చోట మంచినీటి ఛాంబర్ వాల్ విరిగిపోయింది. దీంతో స్థానికులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లగా శనివారం ఆమె జలమండలి అధికారులను అక్కడికి రప్పించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. జలమండలి డీజీఎం సరిత, జీఎం హరిత, సిబ్బంది ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొని మరమ్మత్తులను చేపట్టారని తెలిపారు.

# ఇన్‌స్పెక్టర్ జానకిరెడ్డికి బిఆర్‌ఎస్ నేతల సత్కారం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జానకిరెడ్డిని ఎల్బీనగర్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ సీనియర్‌నాయకుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. జానకిరెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మధుసాగర్, కిరణ్, ప్రతీక్, కృష్ణ, వెంకట్, సంతోష్‌యాదవ్, జైపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం ఖాయం: మిద్దెల

**సైదాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** కేంద్రంలో, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంఛార్జి మిద్దెల జితేందర్ అన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాయ్పూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో భారాసలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఆయన విమర్శించారు. నీరు, నియామకాలు హామీలతో అధికారంలోకి వచ్చిన టిఆర్‌ఎస్ పార్టీ కుటుంబానికి మాత్రమే పదవులు వచ్చాయని. మిగతా వారికి రాలేదన్నారు. రా ష్ట్రంలో రుణమాఫీ హామీ నేటికి నేరవేర్చలేదన్నారు. ఆరోగ్యశ్రీ లేకపోవడం వల్ల పేదలు, ఫీజు రీయంబర్స్‌మెంటు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా భారస ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలగొట్టి బిజెపి అధికారం వస్తుందని, ఇది ఆ పార్టీ అధికార దాహానికి నిదర్శమన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణాతో పాటు అన్ని రాష్టాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రాంరెడ్డినగర్‌లో కార్పొరేటర్ చేతన పర్యటన

**ఉప్పల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లో స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. రాంరెడ్డినగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. డివిజన్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరాపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, బిజెపి డివిజన్ కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పునర్ వైభవాన్ని సాధిస్తుంది : దేప భాస్కర్‌రెడ్డి



మల్లు రవితో దేప భాస్కర్‌రెడ్డి ఇతర నాయకులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** చత్తిస్ ఘడ్ రాష్ట్ర రాజధాని నయారాయపూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలకు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీలో ఏఐసీసీసభ్యులు,మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవితో కలిసి ప్లీనరీ సమావేశాల్లో భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పునర్ వైభవాన్ని సాధిస్తుందన్నారు. నిరుపేదలకు అండగా నిలిచేది దేశంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం అందిస్తానని లింగోజిగూడడివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ జడ్పిహెచ్‌ఎస్‌లో శనివారం ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పిల్లలు ఎలా చదువుతున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనిస్తుండాలని అన్నారు. పేరెంట్స్, టీచర్ మీటింగ్స్‌కు తల్లిదండ్రులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో నర్రె శ్రీనివాస్ కురుమ, కందికంటి శ్రీధర్‌గౌడ్, పిఇటిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, సురేందర్,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# బదిరుల సంక్షేమంకోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి : దేవిప్రసాద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దేవిప్రసాద్, జానకి తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** బదిరుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బ్రేవరేజెస్ కార్పొరేషన్ మాజ ఛైర్మన్ దేవిప్రసాద్ పేర్కొన్నారు. మలక్‌పేటలోని ఫిన్ బధిరుల ఆశ్రమపాఠశాల 16వ వార్షికోతవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవిప్రసాద్, ఆల్ ఇండియా ఫెడరేషన్ డెఫ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బదిర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిజాం అనిల్‌కుమార్, వేణుగోపాల్, బాలసుందరం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతమున్న ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఫిన్ సంస్థకు శాశ్వతంగా ఇప్పించడానికి కృషి చేస్తున్నామని సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఫిన్ స్కూల్ అధ్యక్షురాలు జానకి మాట్లాడుతూ మాట వినికిడి లోపంగల బధిరుల వైద్య, విద్య ఉపాధి రంగాల్లో ఒక రోల్ మోడల్‌గా పని చేస్తుందన్నారు. బాలసుందరి మాట్లాడుతూ 60 గజాల స్థలాన్ని ఫిన్ పాఠశాలకు ఇస్తామని ప్రకటించారు. అనంతరం బధిర విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మహ్మద్ బాబుజాన్, బాలకృష్ణరెడ్డి, రాజు, జ్యోతి, సరస్వతి పాల్గొన్నారు.

# మేయర్‌పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు : బిఆర్‌ఎస్




సమావేశంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్, జ్యోష్న

**ఉప్పల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** వీధి కుక్కలు బాలుడిపై దాడిచేసిన విషయంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిపై దర్శకుడు రాంగోపాల్‌వర్మ తప్పుడు ఆరోపణలు మానుకోవాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న నాగేశ్వర్ రావులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబర్‌పేటలో చిన్నారిబాలుడిపై వీధికుక్కలు దాడి చంపడం తీవ్ర బాధాకరమన్నారు. వీధి కుక్కల నియంత్రణ కోసం జిహెచ్‌ఎంసిలో ఒక విభాగం ఉంటుందని, కమిషనర్, ఇతర అధికారులు ఉంటారని, దీనిపై ఎటువంటి విషయాలు తెలుసుకోకుండా మేయర్‌ను టార్గెట్ చేసి ట్విటర్‌లో ట్విట్ చేయడం సబబు కాదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకుండా రాంగోపాల్‌వర్మ పబ్లిసిటి కోసం హంగామా చేస్తున్నారని, మేయర్‌పై ఆరోపణలు మానుకోకపోతే దాడులు తప్పవని హెచ్చరించారు. వీధికుక్కల దాడులు జరుగకుండా ప్రభుత్వం కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తుందని, బిసి మహిళ అయిన మేయర్‌పై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.మేయర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు, పి.మధుసూధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, నర్సింగ్‌రావు, మనీష్, అలే రమేష్ తదితరులు పాల్గొన్నారు.